# రైతు వ్యతిరేక పార్టీలను తరిమి కొట్టాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్
- ఇల్లంతకుంటలో పార్టీ కార్యకర్తలతో సమావేశం


ఇల్లంతకుంటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబర్ 27 : రైతు వ్యతిరేక పార్టీలను ఎన్నికల్లో ఓడించి తరిమి కొట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో మండల స్థాయి, గ్రామ కమిటీల కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడం వల్లే తెలంగాణ అంధకారంలోకి వెళ్లిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఆచరణ సాధ్యం కాని ఆరు పథకాలను ప్రచారం చేస్తూ అధికారం కోసం పాకులాడుతున్నదన్నారు. ఆ పార్టీని ప్రజలు తరిమి కొట్టాలన్నారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంట్ ఇస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. అక్కడి రైతులు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి మోసపూరితమైన కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటు వేయద్దని ప్రజలను వేడుకుంటున్నారన్నారు. మూడో సారి బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆశ్వీదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ సుధగోని శ్రీనాథ్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్, సర్పంచ్ మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రోండ్ల తిరుపతి రెడ్డి, అన్నాడి అనంతరెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చల్ల నారాయణ, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సాదుల్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్

### జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్


కేశవపట్నంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న గంట మహిపాల్ తదితరులు

శంకరపట్నం, అక్టోబర్ 27: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ అని జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ అన్నారు. శుక్రవారం మండలంలో ఇప్పలపల్లి, ఆముదాలపల్లి, రాజాపూర్, కల్వల, కాచాపూర్, గద్దపాక, కన్నాపూర్, ధర్మారం, ముత్తారం, కొత్తగట్టు, గొల్లపల్లి, మొలంగూర్, మక్త, చింతలపల్లి, లింగాపూర్, మెట్‌పల్లి, వంకాయగూడెం, యెరడపల్లి, అర్కండ్ల, తాడికల్, చింతగుట్ట, అంబాల్‌పూర్, కరీంపేట్, కేశవపట్నం గ్రామాల్లో మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా రసమయితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు ఓటు వేసి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలు పంచిపెట్టారు. బ్యాలెట్ పేపర్ నమూనా, ఈవీఎంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పీ రమేశ్, సర్పంచులు భద్రయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు శ్యాంరావు, అలీమొద్దీన్, పరశురాములు, మధూకర్‌రెడ్డి, పీ మహేందర్, గట్టయ్య, సూర్యం, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ‘ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను గెలిపించాలి’


మహాత్మానగర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, అక్టోబర్ 27: నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరుగుతూ విస్తృత ప్రచారం చేశారు. తెలంగాణ ప్రభుత్వం, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన అభివృద్ధిని వివరించారు. మ్యానిఫెస్టోను, నూతనంగా ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజలకు చెప్పారు. పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి గ్రామంలో భారీ మెజార్టీ వచ్చేలా పని చేయాలని స్థానిక నాయకులకు దేవేందర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కని శ్రీవాణీరవీందర్, ఉపసర్పంచ్ మడుపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నాయిని వెంకట్‌రెడ్డి, అడిశెర్ల సత్యం, మాశెట్టి శివకృష్ణ, తిరుపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపూర్‌లో మైనార్టీలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే


గన్నేరువరం: బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

## బీఆర్ఎస్‌లో చేరికలు

మానకొండూర్, అక్టోబర్ 27: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై మానకొండూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖలీల్ మోహియోద్దీన్‌తో పాటు 20 మంది మైనార్టీ యువకులు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మానకొండూర్‌లో జరిగిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఖలీల్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

***నుస్తులాపూర్ నుంచి..***

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 27: మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన 50 మైనార్టీ కుటుంబాలు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. తిమ్మాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***గుండ్లపల్లి నుంచి..***

గన్నేరువరం, అక్టోబర్ 27: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిమ్మాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో సాధారణ కుటుంబాలకు సైతం న్యాయం చేసేలా ఉందని, సంక్షేమ పథకాలు బాగున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను నమ్మవద్దని, పొరపాటున కూడా ఆ పార్టీకి ఓటు వేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మూడోసారి గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు గూడెల్లి ఆంజనేయులు, చింతల రవి, ఎల్లయ్య, లక్ష్మణ్, అశోక్ , అజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్


పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఇల్లంతకుంట : అక్టోబర్ 27 : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్ విధులు, ఆయుధాలపై ఎస్ఐ సుధాకర్ అవగాహన కల్పించారు. డయల్ 100, షీ టీమ్ గురించి వివరించారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు రాజు, అనిల్, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీకి గడ్డం నాగరాజు రాజీనామా

### 32 ఏండ్ల పాటు పని చేశా • పార్టీ మోసం చేసిందని ఉద్వేగం


గడ్డం నాగరాజు

తిమ్మాపూర్, అక్టోబర్27: మానకొండూర్ నియోజకవర్గ బీజేపీలో కలకలం రేగింది. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు బీజేపీకి రాజీనామా చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. 32 ఏండ్ల పాటు పార్టీకి ఎంతగానో సేవ చేశానని, నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనను కాదని.. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌ను ఎలా చేర్చుకుంటారని లేఖలో ప్రశ్నించారు. తన సేవలను గుర్తించకపోవడం బాధాకరమని వాపోయారు. ఆరెపల్లి మోహన్‌ను అభ్యర్థిగా ప్రకటించడాన్ని ఖండిస్తున్నానన్నారు. అధిష్ఠానం వ్యవహరించిన తీరుతో తీవ్ర మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కిందిస్థాయి కార్యకర్తలు బీజేపీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచన చేశారు. ఇంతకాలం తనను నమ్మి పార్టీకోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, గడ్డం నాగరాజు రెండు, మూడు రోజుల్లో తన భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిసింది.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వెల్ది-రంగపేటలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఊటూర్ సొసైటీ సీఈవో మిట్టపల్లి రవీందర్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 27: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఊటూర్ సొసైటీ సీఈవో మిట్టపల్లి రవీందర్ సూచించారు. మానకొండూర్ మండలం ఊటూర్ సొసైటీ పరిధిలోని లక్ష్మీపూర్, వెల్ది, రంగపేట గ్రామాల్లో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని తాలు, తేమ లేకుండా తీసుకురావాలని సూచించారు. ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ. 2203, బీ గ్రేడ్‌కు రూ. 2183 చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.